క్లుప్తంగా

యువ శాస్త్రవేత్తకు సన్మానం



రవితేజను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్ర తదితరులు

మైదుకూరు : ఇటీవల ఐసీఆర్ఏ (ఐకార్) శాస్త్రవేత్తగా నియమితులైన యువ శాస్త్రవేత్త మాచనూరు రవితేజను మంగళవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ఆధ్వర్యంలో సత్కరించారు. పట్టణానికి చెందిన రవితేజ ఐసీఆర్ఏ శాస్త్రవేత్తగా నియమితులైన విషయం తెలిసిందే. శాస్త్రవేత్తను అభినందిస్తూ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత మానూరు సాగర్ తదితరులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

22న బలిజ ఉచిత వివాహ పరిచయ కార్యక్రమం

మైదుకూరు : మైదుకూరులో ఈనెల 22న ఆదివారం బలిజ కమ్యూనిటీ వధూవరులకు ఉచిత వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జీవీఆర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జీవీ రమణ తెలిపారు. స్థానిక డీసీఎల్ కల్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత రిజిస్ట్రేషన్, వధూవరుల పరిచయ కార్యక్రమం, అభ్యర్థులకు కౌన్సిలింగ్ ఉంటాయని వివరించారు. అభ్యర్థులు తమ బయోడేటా, ఫొటోలతో హాజరు కావాలని, మ్యారేజ్‌బ్యూరోలకు, మధ్యవర్తులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు.

దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు అందజేత



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న వెంకటేశ్వర్లు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను శ్రీగాయత్రి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు, బ్రహ్మశ్రీ వేణుస్వామి పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందించినట్లు శ్రీగాయత్రి సేవా ట్రస్టు చైర్మన్ నిగినే వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శివనాందరెడ్డి, సుబ్బయ్య, నారాయణ, సునీల్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఇంజినీరింగ్ అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని వైఎస్సార్ ఇంజినీరింగ్‌కాలేజీలో అభివృద్ధి పనులకు బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు.

నేడు నమూనా కానిస్టేబుల్ పరీక్ష

ప్రొద్దుటూరు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నమూనా కానిస్టేబుల్ పరీక్షను జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ పరీక్షను కేఎస్ లక్ష్మణరావు సారథ్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కడపలో ఎస్వీ డిగ్రీకాలేజీ, ప్రొద్దుటూరులో స్రుజన్ కోచింగ్ సెంటర్‌లో, మైదుకూరులో మేధా డిఫెన్స్ అకాడమిలో, జమ్మలమడుగులో ఎస్పీ డిగ్రీ కాలేజీలో, పోరుమామిళ్లలో వర్ష కోచింగ్ సెంటర్‌లో నమూనా పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేష్, సుందరయ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు అవగాహన



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ఎస్ఐ రమణ

మైదుకూరు : హెల్మెట్ ధరించండి ప్రాణాపాయం నుంచి బయట పడండి అంటూ మైదుకూరు పోలీసులు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. మంగళవారం మైదుకూరులోని రాయల కూడలిలో ఎస్ఐ సీవీ రమణ, సిబ్బంది ద్విచక్ర వాహనాలను ఆపి, బైక్‌లపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర గాయాలు తగలకుండా హెల్మెట్ కాపుడుతుందని ఎస్ఐ రమణ వివరించారు. ఎస్పీ ఆదేశాలతో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



పుల్లారెడ్డి గ్రామంలో సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చల్లబసాయపల్లె సచివాలయ పరిధిలో పుల్లారెడ్డిపేట, సంజీవరెడ్డిపల్లె గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన వారు ఇంకా ఎవరైనా ఉంటే వారిని గుర్తించి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ ఇరగంరెడ్డి వీరమ్మ, ఎంపీటీసీ స్వర్ణ ఓబుళమ్మ, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల ఓబుళరెడ్డి, గుమ్మా లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలోనూ సంక్షేమం

ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ



పథకాల కరపత్రాన్ని లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

బద్వేలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి గడపలోనూ సంక్షేమం వెల్లి విరుస్తోందని వైఎస్సార్‌సీపీ బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తెలిపారు. మంగళవారం ఆమె పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం-1 సచివాలయం పరిధిలోని రెడ్డినగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలకు కరపత్రాల ద్వారా వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన మూడేళ్లలో వివిధ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పోరుమామిళ్ల మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే తీసుకువచ్చి అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆమె కోరారు. జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కలవకూరి రమణ, మహబూబ్‌పీరా, జల్లి చంద్రాయుడు, నాయకులు చాపాటి నారాయణరెడ్డి, రుద్రవరం ప్రసాద్, తులసి సురేష్, మాలకొండయ్య, ఎంపీడీఓ నూర్జహాన్ పాల్గొన్నారు.

తాగునీటికి రూ.కోటి 20 లక్షలు మంజూరు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : టంగుటూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.కోటి 20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వెల్లడించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల వివరాల సంక్షేమ బావుటా బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రెండు నెలల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రతి వీధికి తాగునీటిని అందిస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే రాచమల్లును పార్టీ నాయకుడు గౌతమ్‌రెడ్డి భారీ గజమాలను క్రేన్ సహాయంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, ముక్కమల్ల శివశంకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



టంగుటూరులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

కృష్ణా జలాల యాజమాన్యం బోర్డును
కర్నూలులో ఏర్పాటు చేయాలి

మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు : కృష్ణానది జలాల యాజమాన్యం బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. ఆయన ప్రొద్దుటూరులోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కృష్ణానదికి సంబంధించిన శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ప్రాంతం రాయలసీమ జిల్లా కర్నూలు అన్నారు. ఇలాంటి ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేయకుండా కృష్ణానదికి ఎటువంటి సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. కృష్ణానది జలాలకు సంబంధించిన సమస్యలపై అన్ని రకాలుగా చర్చించుకునేందుకు కర్నూలు అనువైనదన్నారు.ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌లకు లేఖల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణానది జలాల యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమం చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, గంటసాల వెంకటేశ్వర్లు, అమీర్‌బాషా పాల్గొన్నారు.

• అ'పూర్వ' కలయిక



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బద్వేలు అర్బన్ : మూడు దశాబ్దాలకు పైబడిన అనుబంధం వారిది. ఎప్పుడో చిన్నప్పుడు కలిసి చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులంతా కలుసుకుని తమ జ్ఞాపకాలను పంచుకోవాలనుకున్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని సాధన ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1983-84 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాయం యోగయ్య, గంగసానిసాంబశివారెడ్డి, కోశాధికారి సముద్రాల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సి.వి.సుబ్బారెడ్డి, కె.శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు ఆనంద్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి చిన్నిసుబ్బరాయుడు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. మంగళవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించేలా చూడాలని కోరారు. అలాగే ప్రతి పంచాయతీలో వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో పర్యటించి టీబీ, లెప్రసీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపాదిత విద్యుత్ ధరలపై అభ్యంతరాలను తెలపండి

మైదుకూరు: రానున్న ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రీటైల్ ధరలపై ప్రజల అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేయాలని విద్యుత్ శాఖ మైదుకూరు ఈఈ జీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు రోజూ 2023-24 ఆర్థిక సంవత్సరపు ప్రతిపాదిత ఆదాయ అవసరాలు, రీటైల్ ధరలపై వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజలు సలహాలు, అభ్యంతరాలను తెలియజేయాలని ఈఈ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు, తిరిగి 2 నుంచి 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని మండలాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా వీరభద్రస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, భద్రకాళి మాత



సిద్దారెడ్డిపల్లెలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చాపాడు : సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని కనుమ పార్వేట రోజున అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో గ్రామోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లె దేవళాలు వద్ద నుంచి మొదలైన గ్రామోత్సవం కేతవరం, నెర్రవాడ, బద్రిపల్లె, వీవీ కొట్టాలు, విశ్వనాథపురం, లక్ష్మీపేట, వీరభద్రాపురం, అల్లాడుపల్లె గ్రామాల మీదుగా జరిగి అనంతరం అల్లాడుపల్లె దేవళాలులోని వీరభద్రస్వామి సన్నిధిలో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో ఆయా గ్రామ ప్రజల బాణా సంచా కాల్చుతూ వాయిద్యాల నడుమ వీరభద్రస్వామి, భద్రకాళిమాత ఉత్సవ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు.

చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని చియ్యపాడు గ్రామంలో మొదలైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు సిద్దారెడ్డిపల్లె గ్రామానికి చేరుకుంది. ప్రాచీన కాలం నాటి చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద సంక్రాంతి, కనుమ, పార్వేట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నుంచి శ్రీదేవి భూదేవి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రేపు త్యాగరాజస్వామి గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కానపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో నుంచి శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు శ్రీసద్గురు త్యాగరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

టీడీపీ వారికీ సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఆయన వెంట ఉన్న కార్యకర్తలే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందారన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కమాల్‌బాషా, సత్యం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కలసపాడు : మండలంలోని ఎగువతంబళ్లపల్లె గ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎగువరామాపురం బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం కె.ఎస్.రూరల్ మీడియా కళాజాతర బృందం వారిచేత ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, మెసేజ్ అలర్ట్ వంటి అధునాతన సేవల గురించి వివరించి వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఏటీఎం కార్డులు కావాల్సిన వారు బ్యాంకు నుంచి వెంటనే పొందవచ్చన్నారు. బ్యాంకు ఇన్స్యూరెన్స్, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన వంటి పథకాల ఆవశ్యకతను వివరించారు.

వర్గీకరణకు సహకరించండి

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డికి మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మాదిగలకు ఇచ్చిన మాటను 8 ఏళ్లు గడిచినా నిలబెట్టుకోలేదని తెలిపారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుతో మాట్లాడి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని యల్లారెడ్డిని రారు. ఈ సమస్యపై స్పందించకపోతే ఈనెల 24వ తేదీ నుంచి రాష్ట్రంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా, నియోజకవర్గ నాయకుల ఇళ్లను మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శివశంకర్ మాదిగ, వెంకటరమణ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



పీహెచ్‌సీలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి

గోపవరం : వివిధ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనలు తెలిపారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ, ట్రైనీ కలెక్టర్ వేరువేరుగా తనిఖీలు నిర్వహించారు. నాడు-నేడు పథకం ద్వారా ఆసుపత్రి అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది లేరు అన్న సమస్య రాకూడదన్నారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యులతో పాటు ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది వారి వివరాలను వైద్యాధికారి డాక్టర్ నర్మదను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది, ఓపీ, మెడిసిన్‌కు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ వెంకటరత్నాలు, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, సీహెచ్ఓ గౌస్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

దువ్వూరు : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, టాయిలెట్లను రోజూ శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమీర, సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంతో రైతులకు ఉపయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న బద్వేలు ఏడీఏ

బద్వేలు అర్బన్ : పంటకోత ప్రయోగం చేయడం వలన రైతులు ముందస్తు దిగుబడిని తెలుసుకునే అవకాశం ఉంటుందని బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజు అన్నారు. మండలంలోని అనంతరాజుపురం సచివాలయం పరిధిలో గల దిగువ చెర్లోబోయినపల్లె గ్రామంలో శ్రీనివాస్ అనే రైతు పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో 5x5 విస్తీర్ణంలో పంట కోయగా 13.820 కేజీల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటకోత ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఈఓ సిద్దారెడ్డి, అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ ఫీల్డ్ సూపర్‌వైజర్ సందీప్, రైతులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఉద్యమించిన నేత చెన్నకృష్ణారెడ్డి

పోరుమామిళ్ల : రైతు సమస్యలపై నియోజకవర్గంలో అనేక గ్రామాలు పర్యటించి రైతుల్లో చైతన్యం నింపేందుకు కృషి చేయడంతో పాటు వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించిన నాయకుడు చెన్నకృష్ణారెడ్డి అని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో దివంగత కమ్యూనిస్టు నేత చెన్నకృష్ణారెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.సీపీఐ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్ మాట్లాడారు.

పట్టణంలో రెండు రేషన్ షాపులు సీజ్

ప్రొద్దుటూరు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సాయంత్రం పలు రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు తూకాల్లో వ్యత్యాసాలు ఉండటంతో రెండు రేషన్ షాపులను సీజ్ చేశారు. రెండో వార్డు పరిధిలోని బోగాల నాగిరెడ్డి, మూడో వార్డు పరిధిలోని జంబాపురం అనూష డీలర్లుగా ఉన్న రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తూకాల్లో వ్యత్యాసం ఉండటంతో షాపులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రెడ్డప్ప, ఇదురుబాషా తెలిపారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలి



ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

గోపవరం : ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. మంగళవారం బద్వేలు పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి స్టాకు వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. నాణ్యత కలిగిన పురుగు మందులను రైతులకు ఇవ్వాలని, కాలం తీరిన మందులను ఎట్టిపరిస్థితుల్లోను షాపులలో ఉంచకూడదని డీలర్లకు సూచించారు. ఎరువుల కోసం వచ్చిన రైతుల వివరాలను సేకరించి కొనుగోలు చేసిన బిల్లులను వారికి అందజేయాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు.

లింగాలదిన్నెపల్లెలో పార్వేట ఉత్సవం



బి.మఠం క్రాసింగ్ వద్ద పార్వేట ఉత్సవంలో భక్తులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని లింగాలదిన్నెపల్లెలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఘనంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. రామాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగింపుగా బి.మఠం క్రాసింగ్ వరకు తీసుకెళ్లి పార్వేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం అందరిని ఆకట్టుకుంది.